క్లుప్తంగా...

కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్: డివిజన్‌లోని గొల్లపులయ్య బావి పరిసర ప్రాంతాల్లో వివిధ విభాగాల అధికారులతో కలిసి కార్పొరేటర్ కంది శైలజ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బస్తీలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే దశల వారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట గురుమూర్తి, సురేష్, రాజేష్, నరేష్, నిందిత, కృష్ణకుమారి, భూలక్ష్మి ఉన్నారు.

దళితబంధు దళారులను అరెస్ట్ చేయాలి

చిలకలగూడ: దళితబంధు పథకంలో కమీషన్లు వసూలు చేసిన ఎమ్మెల్యేలు, నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళితబంధులో అవినీతి జరిగిందని, కొంతమంది శాసన సభ్యులు, నాయకులు అవినీతికి పాల్పడి కమీషన్ల పేరిట దోచుకున్నారని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా ప్రమాణ స్వీకారం



అమ్మవారిని దర్శించుకున్న కొండ్రాజు సుబ్బరాజు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ–పోచమ్మ దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా జెక్‌కాలనీకి చెందిన కొండ్రాజు సుబ్బరాజు ప్రమాణ స్వీకారం చేశారు. రెండోసారి అవకాశం పొందిన ఆయన మంగళవారం ఆలయంలో నిర్వహించిన సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఈఓ అన్నపూర్ణల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. సుబ్బరాజు తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవాలయాల అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తూ వస్తున్నారు. అలాగే పలు దేవస్థానాలతో పాటు వివిధ సందర్భాల్లో నిర్వహించే అన్నదాన కార్యక్రమాల్లో భాగస్వామిగా నిలుస్తున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం తరుపున జెక్‌కాలనీ సబ్ స్టేషన్ వద్ద నిర్మించే ఆర్చి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

పీహెచ్‌డీ ఫీజు తగ్గించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థి నాయకులు వీసీ ప్రొ.రవిందర్‌ను కోరారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ న్యూ సెమినార్ హాల్లో పరిశోధన విద్యార్థుల ఆధ్వర్యంలో ఫీజుల పెంపుపై నెల్లిసత్య అధ్యక్షతన జరిగిన సదస్సులో లా డీన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్, ప్రొ.కాశీంతో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు, వివిధ విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని పరిశోధన విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలిపి మాట్లాడారు. ఫీజులు తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని విద్యార్థులు హెచ్చరించారు.

ఎఫ్‌ఓబీని పూర్తి చేయాలి

సనత్‌నగర్: అమీర్‌పేట ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తిరిగి కొనసాగేలా ప్రజల తరుపున జీహెచ్‌ఎంసీ కోర్టులో వాదించాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధికార ప్రతినిధి వైద్య ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆగిపోయిన ఎఫ్‌ఓబీ వద్ద మంగళవారం ఆయన నిరసన తెలిపి మాట్లాడారు. నగరంలో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీ ఎఫ్‌ఓబీలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. కానీ నిత్యం అత్యంత రద్దీగా ఉండే అమీర్‌పేటలో ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం ఆగిపోయి ఏళ్లు గడుస్తున్నా న్యాయపరంగా ఎదుర్కోవాల్సిన జీహెచ్‌ఎంసీ కిమ్మనకుండా ఉండడం విచారకరమన్నారు.జీహెచ్‌ఎంసీ అధికారులు చొరవ తీసుకుని ఎఫ్‌ఓబీ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చూడాలని కోరారు. నిరసనలో నవీన్ సంగి, నాని, రంజిత్, మధు, వాటర్ జాకీర్ పాల్గొన్నారు.

ఆహ్లాదం అందించేలా పార్కుల అభివృద్ధి

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



పార్కు ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: కాలనీల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లో రూ.3.08 కోట్ల పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎస్ఆర్‌టీకాలనీలో రూ.2 కోట్ల వ్యయంతో మల్టీజనరేషన్ థీమ్ పార్కుగా పునఃనిర్మించిన నెహ్రూ పార్కు, సుందర్ నగర్‌లో రూ.52.40 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులు, అల్లావుద్దీన్‌కోఠిలో రూ.48 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా కృషి చేస్తున్నామన్నారు. పార్కును ఎస్ఆర్‌టీ కాలనీవాసులు సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో అద్భుతమైన పార్కును ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. పార్కులో ఎలాంటి ఇతర కార్యకలాపాలకు అవకాశం లేకుండా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అల్లావుద్దీన్ కోఠి పర్యటన సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రికి విన్నవించారు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొనగా, అల్లావుద్దీన్ కోఠి, లోధా అపార్ట్‌మెంట్ పక్క రోడ్లలో భారీ వాహనాలు రాకుండా గడ్డర్స్ ఏర్పాటు చేయాలని జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను మంత్రి ఆదేశించారు. సనత్‌నగర్ ప్రధాన రోడ్డు విస్తరణను మరింత వేగవంతం చేయాలన్నారు. మంత్రి వెంట కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రవికిరణ్, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రమేష్, హార్టికల్చర్ డీడీ శ్రీనివాస్, స్ట్రీట్‌లైట్ డీఈ కిరణ్మయి, ఎలక్ట్రికల్ ఏడీ అమర్నాథ్ ఉన్నారు.

భక్తులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు..



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తలసాని తెలిపారు. ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఆలయాలను అభివృద్ధి చేయడం జరిగిందని ప్రధానంగా బల్కంపేట ఆలయంలో ప్రభుత్వ నిధులే కాకుండా భక్తుల సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.భక్తులను ఇబ్బందులకు గురిచేసే వ్యక్తులు, నిబంధనలు పాటించని వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, నూతన పాలక మండలి సభ్యులు సమన్వయంతో పనిచేసి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి,అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, ఈఓ అన్నపూర్ణ, చైర్మన్ సాయి బాబాగౌడ్ పాల్గొన్నారు.

టీఆర్‌టీ క్వార్టర్స్‌లో కమ్యూనిటీ ఇంటరాక్షన్



అధికారులు, ప్రజలతో చర్చిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతంలో మంగళవారం కార్పొరేటర్ సామల హేమ అధ్యక్షతన కమ్యూనిటీ ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా కాలనీల్లో పర్యటించిన అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించి దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కాలనీ ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పారిశుద్ధ్యం, ఆరోగ్యకర వాతావరణం ఏర్పాటు చేసుకోవడం పట్ల అవగాహన కలిగించారు. రోడ్లు, నాలాల్లో చెత్త చెదారాలు వేయడంతో ఏర్పడే అనారోగ్యకర పరిస్థితుల పట్ల అవగాహన కలిగించారు. ఖాళీ ప్రదేశాలు, ఓపెన్ ప్లాట్లు, రహదారులపై చెత్తడంపింగ్‌లు లేకుండా కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు స్థానిక ప్రజలకు అవగాహన కలిగించాలని అధికారులు సూచించారు. చెత్త డంపింగ్‌ల ద్వారా ఎదురయ్యే సమస్యలను అధికారులకు సమాచారం అందించి సత్వర పరిష్కారం లభించే విధంగా అప్రమత్తంగా ఉండాలన్నారు. డివిజన్ పరిధిలోని మహ్మద్‌గూడగ్రీన్ కార్నర్ ప్రాంతంలో తరచూ మురుగునీటి సమస్యలు పునరావృతం అవుతున్న సీవరేజీ లైన్లను పరిశీలించారు. త్వరలో కొత్త సీవరేజీ లైన్ నిర్మాణం చేపట్టి స్థానికులకు మురుగునీటి సమస్యల నుంచి విముక్తి కలిగిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం వై.కృష్ణ, మేనేజర్లు నవ్య, అన్విత్, జీహెచ్‌ఎంసీ ఏఈ కౌశిక్, స్ట్రీట్‌లైట్స్ పర్యవేక్షకుడు శ్రీనివాస్, శేఖర్, రాజేశ్, అశ్విన్, లలిత, అరుణ, అనిత, గౌస్, రహీం పాషా పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



మాట్లాడుతున్న డా. ఖాదర్ వలీ

లాలాపేట: చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోండి సంపూర్ణ ఆరోగాన్ని సొంతం చేసుకోండని మిల్లెట్ మ్యాన్ ఆఫ్ ఇండియా పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. మంగళవారం తార్నాకలోని నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని చిరు ధాన్యాల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ప్రివెన్షన్ బెటర్ దెన్ క్యూర్ అనే మాటలను నిజం చేయాలని రోగాలు లేకుండా బతకాలనే గత కొంత కాలంగా పని చేస్తున్నానని పేర్కొన్నారు. తమ పరిశోధనలో ఐదు ధాన్యాలు ఆరోగ్యకరం అని కనుగొన్నట్లు ఆయన వివరించారు. సామలు, ఊదలు, కొర్రలు, ఆండు కొర్రలు ఈ ఐదు ధాన్యాలను నిత్యం ఆహారంగా తీసుకుంటే ఏలాంటి రోగాలు దరి చేరవన్నారు. కార్పొరేట్ ప్రాసెస్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన రావాల్సి ఉందన్నారు. పలువురు స్థానికులు అడిగి సందేహాలను ఖాదర్ వలీ నివృత్తి చేశారు. అనంతరం ఈ సమావేశానికి హాజరైన అందరికి చిరు ధాన్యాలతో తయారు చేసిన అల్పాహారాన్ని, రాగి జావను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ టి. తిరుపతిరావు, కార్యదర్శి ఏ. జలేంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

లాలాపేట: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని దానికి నిదర్శనమే పారిశుద్ధ్య కార్మికుల వేతనం పెంపు అని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మేడే కార్మిక దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ పారిశుద్ధ్య కార్మికులకు రూ. వెయ్యి వేతనాన్ని పెంచడం హర్షణీయమన్నారు. వారి అభివృద్ధి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ వద్ద..

బౌద్ధనగర్: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల రూ. 1000 జీతం పెంచిన సందర్భంగా మంగళవారం బౌద్ధ నగర్ కమ్యూనిటీహాల్ వద్ద సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభ్యున్నతికి నిరంతరం కృషి చేసే ఏకైక ప్రభుత్వం టీఆర్ఎస్ అని పేర్కొన్నారు. కంది నారాయణ, రాజేష్, కుమార్, పారిశుద్ధ్య సిబ్బంది శ్రీకాంత్, జ్ఞానేశ్వర్, యాదగిరి, చంద్రశేఖర్ తదితరులు

ఐడిహెచ్ కాలనీలో..

పద్మారావునగర్: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు సీఎం కేసీఆర్ రూ. 1,000 పెంచడం పట్ల మంగళవారం ఐడిహెచ్ కాలనీలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఎల్. వెంకటేషన్ ఆధ్వర్యంలో కార్మికులు జై కేసీఆర్ జైజై కేసీఆర్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ ముదిరాజ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది గోవింద్ రాజ్, జాన్ పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్‌లో ఆత్మహత్యకు పాల్పడిన యువతి గుర్తింపు

రాంగోపాల్‌పేట్: హుస్సేన్‌సాగర్‌లో ఈ నెల ఒకటో తేదీన దొరికిన మృతురాలి వివరాలను రాంగోపాల్‌పేట్ పోలీసులు గుర్తించారు. వివాహం కుదరడం లేదనే మనస్తాపంతోనే యువతి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. ఉప్పల్‌కు చెందిన సంధ్యారాణి (28)కి గతకొన్ని రోజుల నుంచి పెళ్లి సంబంధాలు చూస్తున్నా కుదరడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె సోమవారం ఉదయం ట్యాంక్‌బండ్‌కు చేరుకుని హుస్సేన్ సాగర్‌లో దూకింది. నీళ్లలో మృతదేహం తేలియాడుతుండటంతో రాంగోపాల్‌పేట్ పోలీసులు వెలికితీశారు. పత్రికల్లో వచ్చిన వార్త కథనాలతో మృతురాలి కుటుంబ సభ్యులు గుర్తించారు. పోస్టు మార్టం అనంతరం మంగళవారం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

మూసీ ప్రక్షాళన కోసం పోరాడదాం

రాంగోపాల్‌పేట్: మూసీనది కాలుష్యంతో నగరంలోని ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని దాని ప్రక్షాళన కోసం ప్రతి ఒక్కరూ పోరాటం చేయాలని సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ డిమాండ్ చేసింది. వివిధ సంఘాల ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎర్త్ జస్టిస్ సంస్థగా ఏర్పడి మూసీనది ప్రక్షాళన కోసం గత నెల 23వ తేదీన పాదయాత్ర మొదలు పెట్టారు. ఈ పాదయాత్ర నగరంలోని వివిధ ప్రాంతాల గుండా సాగుతూ మంగళవారం రెతిఫైల్ బస్టాండ్ నుంచి మోండా మార్కెట్‌కు చేరుకుంది. మూసీనది నుంచి వస్తున్న కలుషిత జలాలతో ఎదురవుతున్న అనర్థాలపై కరపత్రాలు, బ్యానర్లు, చిన్నచిన్న సభల ద్వారా చైతన్య పరుస్తున్నారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటదాస్, ప్రెసిడెంట్ పిట్ల నగేష్, కన్వీనర్ నాగుల శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడారు.అనంతగిరి కొండల్లో పుట్టిన మూసీనది వివిధ ప్రాంతాల గుండా ప్రవహిస్తూ పారిశ్రామిక రసాయనిక వ్యర్థాలు, ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు తదితర విష పదార్థాలతో పూర్తిగా కలుషితం అవుతుందన్నారు. ఈ నది పరివాహక ప్రాంతాల్లో పండుతున్న కూరగాయలు, ఆకుకూరలు, గడ్డి తిన్న ఆవులు, బర్రెల నుంచి వచ్చే పాలతో ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఈ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు విష గాలులు పీల్చడంతో గొంతు, కడుపునొప్పి, కంటి సమస్యలు, చర్మవ్యాధులు, తదితర అనారోగ్యాలతో సతమతమవుతున్నారని వివరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మూసీనదిని పూర్తిగా ప్రక్షాళన చేసి స్వచ్ఛమైన నీటిగా మారుస్తామని హామీ ఇచ్చిన నేటికీ దాని ఊసేలేదన్నారు. వచ్చే నెల 15వ తేదీన ఈ పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గోపి, కిరణ్, విశ్వపతి, రఘునాథం తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా సమస్య పరిష్కరించాలి

రాంగోపాల్‌పేట్: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని గత కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్న డిమాండ్‌ను పరిష్కరించాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ కోరింది. సంఘం జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు, ఉపాధ్యక్షులు కడారి రాజు, విద్యాసాగర్, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు విజయ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు ఓరుగంటి ఆనంద్ వినోద్‌కుమార్‌ను కలిసి సమస్యను వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని అసెంబ్లీలో తీర్మానం చేశాయని గుర్తు చేశారు. దళితులు కేవలం మతం మారినంత మాత్రాన వారు ఆర్థిక, రాజకీయంగా ఏ మాత్రం లబ్ధి జరుగడం లేదని మతం అనేది కేవలం వారి వ్యక్తిగత విశ్వాసం మాత్రమేనని వెంటనే దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలన్నారు.

చిరంజీవి కుటుంబాన్ని ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

అడ్డగుట్ట: చోరీ కేసులో అనుమానితుడైన చిరంజీవిది ముమ్మాటికీ లాకప్ డెత్ అని అఖిల పక్ష నేతలు ఆరోపిస్తున్నారు. మంగళవారం అడ్డగుట్ట అంజయ్య విగ్రహం వద్ద ప్రజా సంఘాల నేతలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో లాకప్ డెత్‌కు గురైన చిరంజీవి కుటుంబానికి న్యాయం చేయాలని, అదే విధంగా కారకులైన పోలీసులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూనే మరోవైపు దళిత, గిరిజన, మైనార్టీల హత్యలకు పోలీస్ స్టేషన్లు కేంద్రాలుగా మరుతున్నాయన్నారు. ఏడాది క్రితం అడ్డగూడూరుకు చెందిన మరియమ్మ, మెదక్ ప్రాంతానికి చెందిన ఖదీర్ ఖాన్, నేడు ఎల్‌బీనగర్‌కు చెందిన చిరంజీవిల పై థర్డ్ డిగ్రీ ప్రయోగించి వారి చావులకు కారణమయ్యారని ఆరోపించారు. చిరంజీవి మరణించి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎవరిపై కూడా కేసు నమోదు చేయకపోవడం విడ్డూరమన్నారు. ఇప్పటికే సుప్రీం కోర్టు చాలా స్పష్టంగా లాకప్ రూమ్‌లో సీసీ ఫుటేజీ ఏర్పాటు చేయాలని సూచించినప్పటికీ పట్టించుకోకుండా బలహీనవర్గ ప్రజల పట్ల పోలీసులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మృతుడు చిరంజీవి కుటుంబానికి న్యాయం చేసే విధంగా కోటి రూపాయల నష్టపరిహారం, డబుల్ బెడ్రూమ్ ఇల్లు కేటాయించి, ముగ్గురు పిల్లలను గురుకులాల్లో చేర్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంపల్లి శ్రీనివాస్, డప్పు మల్లికార్జున్, వేణుగోపాల్, సూరారం సుజాత, అజయ్ బాబు, నర్సింగ్‌రావు, రమేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, యాదగిరి, లతీఫ్, రంజిత్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు క్రికెట్ పోటీలు



బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ రాణిగంజ్ డిపోలో మంగళవారం కార్మికులకు నిర్వహించిన క్రికెట్ పోటీల్లో కార్మికులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. రెడ్ టీం, బ్లూటీం ల మధ్య జరిగిన పోటీలో బ్లూటీం విజయం సాధించగా రీజినల్ మేనేజర్ వెంకన్న బహుమతులను అందజేసి మాట్లాడారు. కార్మికులు కలిసి కట్టుగా పని చేస్తూ రాణిగంజ్ డిపోలను లాభాల బాటలో ప్రయాణించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కవిత, అపర్ణకళ్యాణి, డిపో మేనేజర్ లక్ష్మీధర్మా, జ్ఞానేశ్వర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్లపై రాజకీయాలొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కంటోన్మెంట్: సున్నితమైన కంటోన్మెంట్‌లో ఆర్మీ రోడ్ల మూసివేత అంశాన్ని బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేయడం సిగ్గుచేటని కంటోన్మెంట్ బోర్డు సభ్యులు రామకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్ల మూసివేత అంశంపై ఏళ్ల తరబడి తనతో పాటు, బోర్డు అధికారులు సైతం తమ వాదన వినిపించడంతో రక్షణ శాఖ ఎట్టకేలకు సానుకూల నిర్ణయం తీసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా పలు రోడ్ల మూసివేతపై రక్షణ శాఖ కమిటీ వేసిందన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే కొన్ని రోడ్లను తక్షణమే తెరవాల్సిందిగా ఆదేశాలు ఇచ్చిందన్నారు. అయితే బీఆర్ఎస్ నేతలు మాత్రం తమ పోరాటం వల్లే వచ్చిందంటూ దిగజారుడు ప్రకటనలు చేయడం సరికాదన్నారు. బైసన్ పోలో, స్కైవేల కోసం అవసరమైన స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపిందన్నారు. ప్రత్యామ్నాయ రోడ్లకు సైతం భూముల కేటాయించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం చేతగానితనం ప్రదర్శిస్తోందన్నారు. సర్వీసు ఛార్జీల విషయంలో ఆర్మీ, కంటోన్మెంట్‌కు సంబంధించిన లెక్కల్లో తేడా వల్లే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందన్నారు. ఆక్ట్రాయ్, టోల్ ట్యాక్స్ రద్దుతో కంటోన్మెంట్ బోర్డు ఏటా రూ.15 కోట్లు నష్టం వాటిల్లుతోందని ఈ నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాలన్నారు.

కోర్టుకు వెళ్తేనే స్పందించారు..

టీపీటీ బకాయిల కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో తాము కోర్టుకెళ్లడంతోనే బకాయిలు చెల్లిస్తోందన్నారు. ప్రతీ నెలా రూ.10 కోట్ల చొప్పున బకాయిలు చెల్లిస్తామని రాష్ట్ర మంత్రులే ప్రకటించినా ఇవ్వకపోడం సిగ్గుచేటన్నారు. తాము కోర్టు మెట్లెక్కే దాకా రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు ఉచిత నీరు ఇవ్వలేదన్నారు. కంటోన్మెంట్‌కు ఇస్తున్న నీటి పరిమితిని పెంచాలని కోరితే అదనపు చార్జీ చెల్లించాలని అడగడం ఎంతవరకు సబబు అన్నారు.

బోర్డు బకాయిల మాఫీ బీఆర్ఎస్ ఘనతే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన మంచినీటి బకాయిలు రూ.37 కోట్లు మాఫీచేసి, పూర్తిస్థాయిలో ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిల మాఫీతో కంటోన్మెంట్‌కు భారీ ఊరట లభించిందన్నారు. దివంగత ఎమ్మెల్యే సాయన్న జలమండలికి లేఖ రాయడంతోనే అధికారులు స్పందించినట్లు తెలిపారు. పాతికేళ్లుగా సాయన్న హయాంలో నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి జరిగిందన్నారు. పెండింగ్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. మంత్రి కేటీఆర్, దివంగత ఎమ్మెల్యే సాయన్న చొరవ వల్లే కంటోన్మెంట్‌లో ఆరు రోడ్లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్ఎన్‌డీపీ)లో కంటోన్మెంట్‌ను అంతర్భాగం చేయాలని మంత్రి కేటీఆర్‌ను కోరామన్నారు. తద్వారా కంటోన్మెంట్‌లో నాలాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయన్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని వెల్లడించారు. కేంద్రం కంటోన్మెంట్‌కు చెల్లించాల్సిన సర్వీసు ఛార్జీల బకాయిలు రూ.800 కోట్లు విడుదల చేస్తే, కంటోన్మెంట్‌ను సింగపూర్ తరహాలో అభివృద్ధి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, బోర్డ్ మాజీ సభ్యులు పాండు యాదవ్, లోకనాథం, భాగ్యశ్రీ, నళిని కిరణ్, ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, పెద్దాల నర్సింహ, కిరణ్, తేజ్ పాల్, పిట్ల నాగేశ్, సదానంద్ గౌడ్ పాల్గొన్నారు.

గాంధీ ‘జూడా’ జాతీయస్థాయిలో సత్తా



సుమిత్‌ను అభినందిస్తున్న ప్రొ.శ్రవణ్‌కుమార్

గాంధీఆస్పత్రి: గాంధీ మెడికల్ కాలేజీ పీజీ డాక్టర్ సుమిత్ కుమార్ సుమన్ పేపర్ ప్రజంటేషన్ విభాగంలో జాతీయస్థాయిలో సత్తా చాటాడు. ఇండియన్ న్యూరోగ్యాస్ట్రోఎంట్రాలజీ అండ్ మొటిలిటీ అసోషియేషన్ ఆరవ జాతీయ కాంగ్రెస్ సదస్సు నగరంలోని ఓ హోటల్‌లో ఇటీవల జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది వైద్యనిపుణులు హాజరై వైద్య విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. పోస్టర్ ప్రజంటేషన్ విభాగంలో దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలలకు చెందిన 37 మంది పోటీ పడగా, గాంధీ మెడికల్ కాలేజీ గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువుతున్న జూనియర్ డాక్టర్ సుమిత్‌కుమార్ సుమన్ ‘హై రిజల్యూషన్ మోనో మెట్రీ ఇన్ పేషెంట్ విత్ హిస్టరీ ఆఫ్ క్యాస్టిక్ ఇంజ్యూరీ’ అంశంపై సమర్పించిన పోస్టర్‌కు తృతీయ బహుమతి లభించింది. అవార్డుతో పాటు సర్టిఫికెట్, రూ.5 వేల ప్రోత్సాహక బహుమతి అందించారు. యాసిడ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలు తాగిన బాధితులు అస్వస్థత నుంచి కోలుకున్న తర్వాత గుండెల్లో వచ్చే నొప్పికి గల కారణాలను విశ్లేషిస్తూ పేపర్ ప్రజంటేషన్ ద్వారా వివరించిన డాక్టర్ సుమిత్‌ను గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు, గ్యాస్ట్రోఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్‌కుమార్ అభినందించారు.